సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట.. పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు
2

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
RNI NO. TELTEL/2023/88559
తెలుగు దినపత్రిక
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com




నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 112 | పేజీలు : 4 | ఆగస్టు 6 గురువారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 112 | PAGES:4 | THURSDAY AUGUST 6 2026 | Rs. 4:00

## కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో రేవంత్ రెడ్డి భేటీ

- ఢిల్లీ పర్యటనలో బిజీగా సీఎం రేవంత్ రెడ్డి
- కీలక ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై కేంద్రంతో చర్చలు
- భూపేందర్ యాదవ్‌ను కలిసి క్లియరెన్స్‌లపై వినతి
- కాంగ్రెస్ అధిష్ఠానంతోనూ కీలక సమావేశాలు



రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు వేగం తీసుకురావడమే లక్ష్యం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన రాజకీయంగా, అభివృద్ధి పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఉదయం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక ప్రాజెక్టులకు తక్షణమే అటవీ, పర్యావరణ క్లియరెన్స్ ఇచ్చి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్న ఈ సమావేశం అనంతరం, సీఎం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నారు. గోదావరి-కృష్ణా నదీ జలాల పంపిణీ, ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న జల వివాదాలు, (మిగతా 2వ పేజీలో..)

## మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పండి.. మెటాకు కేంద్రం అల్టిమేటం

- ప్రధాని వీడియో తొలగింపుపై జుకర్‌బర్గ్‌కు 3 రోజుల గడువు
- క్షమాపణ చెప్పి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిటీ సూచన
- లేకపోతే సేఫ్ హార్బర్ రక్షణపై చర్యలుంటాయని హెచ్చరిక
- సాంకేతిక లోపమే కారణమని మెటా వివరణ
- మెటా వివరణపై ఐటీ శాఖ అసంతృప్తి.
- చిన్నారుల అసభ్యకర కంటెంట్‌పై సోషల్ మీడియా సంస్థలకు మరో హెచ్చరిక

భారత ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను ఫేస్‌బుక్‌లో కొద్దిసేపు తొలగించిన ఘటనపై మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కు కేంద్ర ప్రభుత్వం మూడు రోజుల గడువు విధించినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ సూచించింది. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ఈ కమిటీ, (మిగతా 2వ పేజీలో..)



## టీవీకే తొలి బడ్జెట్.. కొత్త పథకాలపై సర్వత్రా ఆసక్తి

- ఆర్థిక పరిమితుల నడుమ బడ్జెట్ రూపకల్పన
- కొత్త పథకాలు, పాలనా సంస్కరణలపై దృష్టి
- రేపు తొలిసారిగా వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం



తమిళనాడులోని టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వం నేడు (బుధవారం) శాసనసభలో తన తొలి బడ్జెట్‌ను (మిగతా 2వ పేజీలో..)

## “బ్లాస్ట్ కాదు వేస్ట్”.. విజయ్ సర్కారు తొలి బడ్జెట్‌పై స్టాలిన్ స్పందన ఇదే!

- టీవీకే ప్రభుత్వ తొలి బడ్జెట్‌పై విరుచుకుపడిన స్టాలిన్
- ఇది ద్రవిడ మోడల్ బడ్జెట్‌కు రీమేక్ అని తీవ్ర విమర్శ
- ఎన్నికల కీలక హామీలను విస్మరించారని ఆరోపణ
- డీఎంకే పథకాలకే పేర్లు మార్చారని ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్య
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న ప్రతిపక్ష డీఎంకే

తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన టీవీకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌పై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో (మిగతా 2వ పేజీలో..)



## బెదిరింపులకు భయపడేది లేదు.. రాహుల్ గాంధీని కలిసిన విద్యార్థి నిరసనకారులు

- నిరసన చేస్తున్న విద్యార్థులు రాజ్యాంగ సంరక్షకులని రాహుల్ గాంధీ అభివర్ణన
- వారు ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ
- ప్రధానిపై వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో విద్యార్థులకు రాహుల్ మద్దతు
- ఇళ్ల వద్దకు గూండాలను పంపి క్షమాపణ చెప్పాలని బెదిరిస్తున్నారని ఆరోపణ
- పోలీసుల తీరు, వేధింపులపై రాహుల్ సమక్షంలో విద్యార్థుల ఆవేదన

ఇటీవల సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలతో వార్తల్లో నిలిచిన విద్యార్థులకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ (మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో రేవంత్ రెడ్డి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించనున్నారు.కేంద్ర మంత్రులతో వరుస సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలతో భేటీ కానున్నట్లు సమాచారం. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రివర్గ కూర్పును విజయవంతంగా కొలిక్కి తెచ్చిన హైకమాండ్, ఇప్పుడు తెలంగాణలో కూడా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణపై దృష్టి సారించింది. రాజీనామా బెదిరింపులకు వెనక్కి తగ్గకుండా కర్ణాటకలో ప్రయోగించిన 'కఠిన వైఖరి' ఫార్ములానే తెలంగాణలోనూ వర్తింపజేసి, మంత్రిపదవుల ఆశావహుల అసంతృప్తులకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ఈ భేటీ తర్వాత తెలంగాణ కేబినెట్ విస్తరణపై ఏఐసీసీ నుంచి కీలక ప్రకటన వెలువడే అవకాశాలు ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# టీవీకే తొలి బడ్జెట్.. కొత్త పథకాలపై సర్వత్రా ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)



ప్రవేశపెట్టనుంది. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్ల దృష్ట్యా, ఎన్నికల హామీలు మరియు అభివృద్ధి లక్ష్యాల మధ్య సమతుల్యత పాటిస్తూ ఈ బడ్జెట్‌ను రూపొందించడం ప్రభుత్వానికి అత్యంత కీలకంగా మారింది.ఆర్థిక, ప్రణాళిక మరియు అభివృద్ధి శాఖ మంత్రి ఎన్. మేరీ విల్సన్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. కొత్త ప్రభుత్వ విధానాలకు, ప్రాధాన్యతలకు ఈ బడ్జెట్ అద్దం పట్టనుంది. నిధుల కొరత కారణంగా ఇప్పటివరకు ప్రభుత్వం భారీ సంక్షేమ పథకాల ప్రకటనల విషయంలో ఆచితూచి వ్యవహరించింది. ఇప్పటికే ప్రకటించిన 'తైమామన్ తంగ మోదిరం' పథకం మినహా ఇతర ప్రధాన ప్రకటనలేవీ వెలువడలేదు. అయితే, ఈ బడ్జెట్‌లో కొన్ని నూతన పథకాలు, పాలనాపరమైన సంస్కరణలు ఉండవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రజలపై అదనపు పన్నుల భారం మోపకుండా ఆదాయ వనరులను పెంచుకోవడం, వ్యయ నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మెరుగైన పాలనతో పాటు ప్రజా సేవలను మరింత వేగవంతం చేసేందుకు కీలక రంగాల్లో సంస్కరణలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం శాసనసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశమై సభా కార్యకలాపాల షెడ్యూల్‌ను ఖరారు చేయనుంది. కాగా, గురువారం నాడు రాష్ట్ర తొలి వ్యవసాయ బడ్జెట్‌ను వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి ఆర్. వినోత్ సభలో ప్రవేశపెడతారు. ఈ అసెంబ్లీ సమావేశాలు సుమారు 25 రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది.

# మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పండి.. మెటాకు కేంద్రం అల్టిమేటం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని వీడియో తొలగింపును ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాని వీడియోను తొలగించడం తీవ్రమైన విషయంగా పేర్కొంది.మూడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఫేస్‌బుక్‌కు ప్రస్తుతం ఉన్న 'సేఫ్ హార్బర్' రక్షణను తొలగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించినట్టు సమాచారం. అలా జరిగితే సోషల్ మీడియా సంస్థ అధికారులపై నేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది.జులై 23న ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ వీడియోను పోస్టు చేశారు. తర్వాత అదే వీడియోను ఫేస్‌బుక్‌లో కూడా షేర్ చేశారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రశ్నాపత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని దాంట్లో హామీ ఇచ్చారు. అయితే ఫేస్‌బుక్‌లో ఆ వీడియో కొద్దిసేపు కనిపించకుండా పోవడంతో వివాదం చెలరేగింది. విమర్శలు రావడంతో మెటా వెంటనే ఆ పోస్టును పునరుద్ధరించింది.ఇటీవల పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైన మెటా ప్రతినిధులు, ఇది సాంకేతిక లోపం వల్ల జరిగిందని క్షమాపణ చెప్పారు. అయితే ఐటీ శాఖ ఆ వివరణను పూర్తిగా అంగీకరించలేదు. నిజంగా సాంకేతిక లోపమే అయితే అలాంటి సమస్యలు మళ్లీ రాకుండా మెటా తన వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించింది.ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన అసభ్యకర కంటెంట్ ప్రకటనల రూపంలో కనిపిస్తున్న వ్యవహారంపైనా మెటాపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటీసు ఇచ్చింది. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ మరోసారి హెచ్చరిక జారీ చేసింది. గూగుల్, యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ సహా అన్ని సోషల్ మీడియా వేదికలు చిన్నారులపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను కట్టడి చేసే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. ఉల్లంఘనలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.



# బెదిరింపులకు భయపడేది లేదు.. రాహుల్ గాంధీని కలిసిన విద్యార్థి నిరసనకారులు

(మొదటి పేజీ తరువాయి)

అండగా నిలిచారు. వారు "రాజ్యాంగ సంరక్షకులు" అని అభివర్ణించిన రాహుల్, తమ హక్కుల కోసం పోరాడుతున్న వారు ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులు, ముంబైలో పోలీస్ వ్యాన్‌ను అడ్డుకుని వైరల్ అయిన యువతితో కలిసి బుధవారం ఆయన తన నివాసం (10 జన్?పథ్) వెలుపల మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. "ఈ యువత, వీరిలాంటి వేలాది మంది భారతీయ యువకులు చేసిన దానికి నేను గర్వపడుతున్నాను. వారు రాజ్యాంగాన్ని, భారత దేశ స్ఫూర్తిని, దేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలిపోతున్న పనికిమాలిన వ్యవస్థకు వ్యతిరేకంగా గళం విప్పడం నేరం కాదు. వారు తమ ప్రజాస్వామ్య హక్కును మాత్రమే వినియోగించుకున్నారు" అని అన్నారు.

**క్షమాపణ వివాదంపై ఆగ్రహం**

జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో 15 ఏళ్ల బాలిక ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆ తర్వాత కేసు నమోదు కావడంతో ఆమె సోషల్ మీడియాలో క్షమాపణ చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ సహా పలు పార్టీలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. బాలికను భయపెట్టి, బలవంతంగా క్షమాపణ చెప్పించారని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందిస్తూ.. విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుపట్టారు."విద్యార్థులు శాంతియుతంగా, ఎటువంటి దూకుడు లేకుండా నిరసన తెలిపారు. అయినా వారిని కొట్టారు, వేధించారు, బెదిరించారు. ఇప్పుడు వారి ఇళ్ల వద్దకు గూండాలను పంపి, క్షమాపణ చెప్పాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇది పూర్తిగా అర్థరహితమైన చర్య. మేము దీనిని అంగీకరించం" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి, విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మెరుగైన విద్యా వ్యవస్థ, పరీక్షా పత్రాల లీకేజీలకు ముగింపు, యువతకు సురక్షితమైన భవిష్యత్తు కావాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

**మా గళం వినిపిస్తూనే ఉంటాం: విద్యార్థులు**

ఈ సమావేశంలో ముంబైలో పోలీస్ వ్యాన్‌ను అడ్డుకున్న విద్యార్థి కార్యకర్త రియా అహిర్ మాట్లాడుతూ.. "నేను ముంబైలో పోలీస్ వ్యాన్‌ను ఆపిన అమ్మాయినే. నా గురించి ఇప్పుడు రకరకాల కథనాలు ప్రచారం చేస్తున్నారు. నేను పోలీసుల విధులకు ఆటంకం కలిగించలేదు. 20 మంది విద్యార్థులను అక్రమంగా నిర్బంధించకుండా అడ్డుకున్నాను. దీనికోసం ఇప్పుడు నన్ను వేధిస్తున్నారు. జూలై 27న పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఆగస్టు 5 వచ్చినా ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అయితే, నేను ఎవరికోసమైతే నిలబడ్డానో, ఆ యువత ఇప్పుడు నాకు అండగా నిలబడటం సంతోషంగా ఉంది" అని తెలిపారు. మరో నిరసనకారిణి ఫరా నాజ్ మాట్లాడుతూ.. "జూలై 20న మేము జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. మమ్మల్ని అదుపులోకి తీసుకుని దేశద్రోహులుగా ముద్ర వేశారు. ఎవరు ఏమనుకున్నా, మా దేశం కోసం, మా హక్కుల కోసం మా గళం వినిపిస్తూనే ఉంటాం" అని ధీమా వ్యక్తం చేశారు.

# "బ్లాస్ట్ కాదు వేస్ట్".. విజయ్ సర్కారు తొలి బడ్జెట్‌పై స్టాలిన్ స్పందన ఇదే!

(మొదటి పేజీ తరువాయి)

విరుచుకుపడ్డారు. ఈ బడ్జెట్ పూర్తిగా నిరాశపరిచిందని, ఇందులో కొత్తదనం లేదని, దూరదృష్టితో కూడిన పథకాలు కరవయ్యాయని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన కీలక హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్టాలిన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "ప్రజలు దీన్ని ఒక 'బ్లాస్ట్' అనుకుంటే, ఇది 'వేస్ట్'గా తేలింది. ఇది గత 'ద్రవిడ మోడల్' ప్రభుత్వ బడ్జెట్‌కు రీమేక్ తప్ప మరొకటి కాదు" అని స్టాలిన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం నుంచి ప్రజలు భారీ ప్రకటనలు ఆశించారని, కానీ వారి ఆశలన్నీ అడియాసలయ్యాయని అన్నారు. "ఈ బడ్జెట్ బాంబులా పేలుతుందని అందరూ అనుకుంటే, చివరికి తుస్సుమన్న పటాసులా మారింది" అని ఆయన ఎద్దేవా చేశారు. గత డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకే కొత్త రంగులు పులిమి, తమవిగా ప్రచారం చేసుకుంటున్నారని ఆక్షేపించారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యుత్ బిల్లుల గందరగోళం, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు వంటి ప్రధాన సమస్యలను బడ్జెట్‌లో ఏమాత్రం ప్రస్తావించలేదని స్టాలిన్ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో టీవీకే ఇచ్చిన ప్రధాన హామీల గురించి బడ్జెట్‌లో మౌనం వహించడంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. "మహిళలకు నెలకు రూ.2,500, నిరుద్యోగ యువతకు రూ.4,000, ఏడాదికి ఆరు ఉచిత గ్యాస్ సిలిండర్లు, పంట రుణాల పూర్తి మాఫీ వంటి హామీల ఊసే లేదు" అని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రానికి దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికను అందించడంలో ఈ బడ్జెట్ విఫలమైందని స్టాలిన్ దుయ్యబట్టారు.మరోవైపు, ప్రతిపక్ష నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా బడ్జెట్‌పై విమర్శలు గుప్పించారు. గత డీఎంకే ప్రభుత్వం ప్రారంభించిన అనేక పథకాల పేర్లను మార్చి, టీవీకే ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటోందని ఆయన ఆరోపించారు. చెన్నైలోని సెక్రటేరియట్‌లో బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త పథకాలను తీసుకురాకుండా, పాతవాటినే కొత్త కార్యక్రమాలుగా చూపే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. ప్రభుత్వం నెరవేర్చని హామీలపై అసెంబ్లీలో నిలదీస్తామని ఉదయనిధి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, తంజావూరులో నటి త్రిషకు సంబంధించి చేసిన వ్యాఖ్యల కేసులో మంగళవారం పోలీసులు తనను అదుపులోకి తీసుకోవడాన్ని ఉదయనిధి ప్రస్తావించారు. బడ్జెట్ సమావేశాలకు ముందు ప్రతిపక్ష నేతగా ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని డీఎంకే ఆరోపిస్తోంది. టీవీకే ప్రభుత్వం తొలి బడ్జెట్ ప్రవేశపెట్టిన కొద్ది గంటల్లోనే డీఎంకే నేతల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో, తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

# సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట.. పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు

**కామరాజర్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు**

**10 వేల పాఠశాలల్లో సూపర్ క్లీన్ క్యాంపస్ పథకం**

**కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు**

**సంక్షేమ పథకాలకు భారీ నిధుల కేటాయింపు**

**అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టడమే లక్ష్యం**

ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం లభించింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్య కోసం రూ.44,527 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ఎన్.మారీ విల్సన్ ప్రకటించారు.9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం 'పెరుంతలైవర్ కామరాజర్ మోడల్ స్కూల్స్' పేరుతో ఆధునిక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యతో పాటు భోజనం, వసతి, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తారు. ఈ పథకానికి మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.125 కోట్లు కేటాయించారు.ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలకు 'సూపర్ క్లీన్.. సూపర్ క్యాంపస్' పథకం కింద రూ.129 కోట్లు కేటాయించారు. తొలి దశలో 10 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు.ఉన్నత విద్యనభ్యసించేవాళ్లకు 'వెట్రి ల్యాప్‌టాప్ పథకం' కింద ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసేందుకు రూ.2,000 కోట్లు కేటాయించారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే అవగాహన కార్యక్రమాలకు రూ.7 కోట్లు కేటాయించారు.సంక్షేమ పథకాలకూ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకానికి రూ.560 కోట్లు కేటాయించింది. పెళ్లి రోజు వధువుకు ఎనిమిది గ్రాముల బంగారు నాణెం, పట్టు చీర అందించే పథకానికి రూ.812 కోట్లు ప్రతిపాదించింది.రాష్ట్ర అప్పులు గత ఐదేళ్లలో రెట్టింపు అయ్యాయని మంత్రి తెలిపారు. అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్



# ఆగస్టు 7న బెంగళూరులో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభకు బయలుదేరిన ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీ నాయకులు

**మండల్ కమిషన్ ప్రధాన సిఫారసులన్నిటిని అమలు చేయాలి**
**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**

**మిర్యాలగూడ ఆగస్టు 5 నేటి వెలుగు ప్రతినిధి**

బీసీలకు విద్యా,ఉద్యోగ రంగాల్లో 27% రిజర్వేషన్లు అధికారికంగా అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం 1990 ఆగస్టు 7న,అప్పటి ప్రధానమంత్రి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ లోక్‌సభలో ప్రకటించారని దాని సందర్భంగా ఆగస్టు 7న మండల్ దినోత్సవం సామాజిక న్యాయం దినోత్సవం జరుపుకుంటారని అన్నారు. బెంగళూరులో జరిగే అఖిలభారత జాతీయ ఓబిసి 11వ మహాసభకు ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి వంద మంది బయలుదేరే బస్సులను బిసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ బీసీలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీసీలను ఐక్యం చేసి బీసీల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతామని అన్నారు. మండల్ కమిషన్ ప్రధాన సిఫారసులన్నింటిని అమలు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య బంటు కవిత తుపాకుల తుకారం నక్క నాగరాజు, మునుగోడు నాయకులు మల్లికార్జున యాదవ్ సూర్యాపేట నాయకులు సంపత్ నాయుడు గజ్జల సత్యరాజు సంధ్య సునీత తదితరులు పాల్గొన్నారు



# భూమి కోల్పోయిన రైతులకి చెక్కులు అందజేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 5 నేటి వెలుగు ప్రతినిధి**

సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమి ఇచ్చిన అల్వాల్ భూయజమానులకు చెక్కులు అందజేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్. బుధవారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్లో సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి నిర్మాణానికి 2264 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చిన అల్వాల్ భూయాజమానులకు డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టర్ 33 కోట్ల రూపాయల పరిహార నిధుల చెక్కును అందజేసారు. అనంతరం ప్రత్యేక భూసేకరణ అధికారి మాలతి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నఈ ప్రాజెక్టులో భాగంగా అల్వాల్‌లోని స్థలానికి సంబంధించి ఇటీవల జరుగుతున్న అసత్య ప్రచారాలను మరియు తప్పుడు ఆరోపణలను వ్యతిరేకిస్తున్నానన్నారు. చట్టబద్ధమైన ప్రక్రియలు మరియు రికార్డులను పక్కనబెట్టి, సర్వే నంబరు 168 భూమి పై ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధార వార్తలను ప్రజలకు చేరవేయకూడదని స్పష్టం చేసారు.



# కామన్వెల్త్ గేమ్స్‌లో కలకలం.. గ్లాస్గోలో పాకిస్థాన్ స్టార్ బాక్సర్ కుద్రతుల్లా అదృశ్యం!

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో ఇటీవలే ముగిసిన కామన్వెల్త్ గేమ్స్-2026 వేదికగా ఒక షాకింగ్ పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్‌కు చెందిన స్టార్ బాక్సర్ కుద్రతుల్లా గేమ్స్ విలేజ్ నుంచి అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. టోర్నీ ముగిసి పాకిస్థాన్ జట్టులోని ఇతర అథ్లెట్లు, అధికారులు స్వదేశానికి తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో ఈ విషయం వెలుగులోకి రావడం పాకిస్థాన్ బాక్సింగ్ ఫెడరేషన్ (పీబీఎఫ్)కు తీవ్ర అవమానకరమైన పరిస్థితిగా మారింది.




అసలేం జరిగింది?

కుద్రతుల్లా 57 కేజీల ఫెదర్‌వెయిట్ విభాగంలో పాకిస్థాన్ తరఫున కామన్వెల్త్ గేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించాడు. అయితే క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి పాలైన తర్వాత, ఆగస్టు 2న గేమ్స్ ముగిసి జట్టు తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్న సమయంలో ఆయన ఎవరికీ చెప్పకుండా గ్లాస్గోలోని తన గది నుంచి కనిపించకుండా పోయాడు. జట్టు మేనేజర్, అధికారులు ఆయన గదిని పరిశీలించగా.. తన పాస్‌పోర్ట్, ప్రయాణ పత్రాలు, ఇతర విలువైన సామగ్రితో పాటు ఆయన పరారైనట్లు నిర్ధారణ అయింది. కేవలం మాతృదేశానికి వెళ్లే ఎయిర్ టికెట్లను మాత్రమే గదిలోని టేబుల్‌పై వదిలేసి వెళ్లాడని పాక్ క్రీడా వర్గాలు వెల్లడించారు.

పాకిస్థాన్ బాక్సింగ్ బోర్డు ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు!

ఈ ఘటనపై పాకిస్థాన్ బాక్సింగ్ ఫెడరేషన్ (పీబీఎఫ్) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. నిబంధనల ప్రకారం అథ్లెట్ల పాస్‌పోర్ట్‌లు అధికారుల వద్దే ఉండాలి. కానీ ప్రయాణ విమాన టికెట్ల నమోదు ప్రక్రియ కోసం పాస్‌పోర్ట్ అందుకున్న కుద్రతుల్లా, ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని గ్లాస్గో నుంచి కనిపించకుండా పోయాడని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఉదంతంపై గ్లాస్గో స్థానిక పోలీసులకు, కామన్వెల్త్ గేమ్స్ నిర్వాహకులకు పీబీఎఫ్, పాక్ కాన్సులేట్ అధికారులు అధికారికంగా ఫిర్యాదు చేశారు. అలాగే, ఆయనపై తీవ్ర క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు పాకిస్థాన్‌లో ఒక ప్రత్యేక విచారణ కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

పాక్ అథ్లెట్లకు ఇది కొత్త కాదు!

అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శన కోసం వెళ్లి పాకిస్థాన్ క్రీడాకారులు ఇలా మాయమవ్వడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా బ్రిటన్, జర్మనీ, ఇతర ఐరోపా దేశాల్లో జరిగిన క్రీడా పోటీలకు వెళ్లిన పలువురు పాక్ బాక్సర్లు, ఈతగాళ్ళు మాతృదేశానికి తిరిగి రాకుండా యూరప్‌లోనే అక్రమంగా ఉండిపోవడం లేదా శరణార్థి హోదా కోసం దరఖాస్తు చేసుకోవడం వంటి ఘటనలు వెలుగుచూశాయి. పాకిస్థాన్‌లో నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం లభించకపోవడం, భవిష్యత్తుపై అభద్రతాభావం వల్లే అథ్లెట్లు ఇలాంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లాస్గో పోలీసులు బ్రిటన్ అంతటా కుద్రతుల్లా కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# మరణించిన ఉపాధ్యాయుడు మహమ్మద్ అఫ్జల్ కుటుంబానికి రూ.67,000 ఆర్థిక సహాయం

**నల్లగొండ ఆగస్టు 05 నేటి వెలుగు ప్రతినిధి:**



ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహమ్మద్ అఫ్జల్ కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తూ టీఎస్పీటీఏ ఉర్దూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రూ. 67,000 నగదు విరాళాన్ని జమ్మేతుల్ ఉలుమాయే హింద్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ఎహ్సానుద్దీన్ ఖాస్మీ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మౌలానా ఎహ్సానుద్దీన్ ఖాస్మీ మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక, మానవీయ బాధ్యత అని పేర్కొన్నారు. కష్టకాలంలో ఒకరికి ఒకరు అండగా నిలవడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలోపేతం అవుతాయని అన్నారు. మహమ్మద్ అఫ్జల్ కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ఉదారంగా విరాళాలు అందించిన ఉర్దూ మీడియం ఉపాధ్యాయులందరినీ ఆయన హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సహాయం ఆ కుటుంబానికి కొంతైనా ఊరటనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లిమౌలానా అక్బర్, టీఎస్పీటీఏ జిల్లా అధ్యక్షులు ఎం.ఏ.గఫూర్, ప్రధాన కార్యదర్శి ఎం.డి. షాహిన్ తయ్యబ్,ఉర్దూ ఉపాధ్యాయులు హుసాముద్దీన్, బియభాని, అయూబ్ ఖాన్, బషారత్ అలీబఖర్, జలాల్ తదితరులు పాల్గొన్నారు.టీఎస్పీటీఏ ఉర్దూ ఉపాధ్యాయ సంఘం చేపట్టిన ఈ మానవతా కార్యక్రమాన్ని పలువురు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# యువత క్రీడా పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి : మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ:**



యువత క్రీడా పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని నల్లగొండ నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మేకల అభినవ్ నల్లగొండలో అండర్-16 క్రికెట్ లీగ్ మ్యాచ్‌ల ప్రారంభం అయ్యాయి. ఈ మ్యాచ్ లను మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువ క్రికెటర్లలో ప్రతిభను వెలికితీసి, రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ లీగ్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. మ్యాచ్‌ల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు, క్రీడా ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సయ్యద్ అమీనుద్దీన్, డీకేఎస్‌వో అక్బర్, అసోసియేషన్ సభ్యుడు షఫీయుద్దీన్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అండర్-16 లీగ్‌లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-16 రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ఇటువంటి లీగ్ పోటీలు ఎంతో దోహదపడతాయని, యువ ఆటగాళ్లకు ఇవి మంచి వేదికగా నిలుస్తాయని క్రీడా సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

# పక్కా ఓటర్ల జాబితాయే లక్ష్యం - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ఆగస్టు 5 నేటి వెలుగు ప్రతినిధి**



ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డీవో, తహసీల్దార్‌తో పాటు బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో కలెక్టర్ బుధవారం సూర్యాపేట మండల కేంద్రంలో సూర్యపేట తహసిల్దార్ గారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎన్యూమరేషన్ ఫారాల క్షేత్రస్థాయి పరిశీలన సమావేశంలో ప్రధానంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ, డేటా నమోదుపై క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన ఫారాలను క్షేత్రస్థాయిలో రీ-వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అన్ కలెక్టెడ్ ఫారాలకు సంబంధించి ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ కేటగిరీల వారి వివరాలను పక్కాగా నిర్ధారించుకోవాలని చెప్పారు. ఎక్కడైనా డూప్లికేట్ ఓట్లు లేదా ఒకే రకమైన సమాచారం నమోదై ఉంటే వాటిని వెంటనే గుర్తించి సరి చేయాలని ఆదేశించారు. సవరణ ప్రక్రియకు గడువు పొడిగించినందున లభించిన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏ ఒక్క అర్హుడి ఓటు మిస్ కాకుండా, ఎలాంటి తప్పుల్లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసే బాధ్యత బీఎల్ఓలు, సూపర్‌వైజర్లపై ఉందన్నారు. కలెక్టరేట్ అధికారులు సైతం మండలాల వారీగా డేటాను క్రాస్ చెక్ చేస్తున్నారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారంలో డిక్లరేషన్ ఇచ్చేటప్పుడు ఒక్క చోటే దరఖాస్తు చేస్తున్నాం అని సంతకం చేస్తారని గుర్తుచేశారు. ఒకవేళ కావాలని డూప్లికేట్ ఫారాలు సమర్పించినా, తప్పుడు వివరాలు ఇచ్చినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డిఓ వేణుమాధవ్ రావు తహసిల్దార్ సాయి గౌడ్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు...

**నల్గొండ ఆగస్టు 5 నేటి వెలుగు ప్రతినిధి**



బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి జన్మదిన సందర్భంగా బిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని వారి నివాసంలో ఘనంగా వారి జన్మదిన వేడుకలను నిర్వహించడం జరిగింది. ఆ భగవంతుని దీవెనలతో నిండు నూరేళ్ల ఆయువు ఆరోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, బిఆర్ఎస్వి నాయకులు ఎస్.కె లతీఫ్, ముక్కామల వెంకన్న నారి నరసింహ, బొడ్డు శంకర్,అలుగు బెల్లి రామ్ రెడ్డి,నాంపల్లి మనోహర్,అలుగుబెల్లి సైదిరెడ్డి, కంచర్ల శ్రవణ్ గౌడ్,కొండాపురం అరుణ్ కుమార్,కర్నాటి మల్లేష్,కొప్పు మహేష్ గౌడ్, మేడి విజయ్ కుమార్,దర్శనం భార్గవ్, బైరగోని లింగస్వామి, పగిల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

# ప్రదీప్ రావత్ మృతిపై సల్మాన్ ఖాన్ భావోద్వేగ స్పందన



బాలీవుడ్ సీనియర్ నటుడు, తన విలక్షణ నటనతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రదీప్ రావత్ (74) కన్నుమూశారు. కొంతకాలంగా కేన్సర్‌తో పోరాడుతున్న ఆయన, ఆరోగ్యం విషమించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. పలువురు సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా నివాళులర్పిస్తున్నారు.బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ తన స్నేహితుడు, సహనటుడైన ప్రదీప్ రావత్‌ను గుర్తుచేసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ పెట్టారు. 1990లో వచ్చిన 'బాఘీ: ఏ రెబెల్ ఫర్ లవ్' సినిమాలో ప్రదీప్‌తో కలిసి నటించినప్పటి ఫోటోను షేర్ చేశారు. "సోదరా, నీతో ఎన్నో మంచి క్షణాలు పంచుకున్నాను.. నీ ఆత్మకు శాంతి కలగాలి" అని రాసుకొచ్చారు. ఈ చిత్రంలో సల్మాన్ కథానాయకుడిగా నటించగా, ప్రదీప్ 'బుద్ధ' అనే కీలక పాత్రలో కనిపించారు,అలాగే, 'మహాభారత్' సీరియల్‌లో ప్రదీప్ సహనటుడైన సురేంద్ర పాల్ సింగ్ కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ చోప్రా రూపొందించిన ఈ ఐకానిక్ సిరీస్‌లో ద్రోణాచార్యుడి పాత్ర పోషించిన సురేంద్రపాల్, అశ్వత్థామగా నటించిన ప్రదీప్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "త్వరగా వెళ్లిపోయావు, కానీ నిన్ను ఎప్పటికీ మర్చిపోలేం. నీ అంకితభావం, నటన అద్భుతం. నిజమైన లెజెండ్స్ వారి పనుల ద్వారా చిరస్థాయిగా నిలిచిపోతారు. ఓం శాంతి మిత్రమా" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ కూడా ప్రదీప్ రావత్‌ను స్మరించుకున్నారు. "ప్రదీప్ రావత్ గారితో పనిచేసే అదృష్టం నాకు దక్కింది. ఆయనొక నిజమైన జెంటిల్మన్. ఆయన నవ్వితే ఆ గది మొత్తం నవ్వుతో నిండిపోయేది" అంటూ ఆయన గొప్ప వ్యక్తిత్వాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రదీప్ రావత్ తన కెరీర్‌లో ఎన్నో పవర్‌ఫుల్ పాత్రలు, ముఖ్యంగా సై, ఛత్రపతి, గజినీ వంటి చిత్రాల్లో ప్రతినాయకుడి పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. ఆయన మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


# విజయ్ నాకు మంచి మిత్రుడు.. కానీ సీఎం అనే పిలవాలి: మాధవన్

**విజయ్ సీఎం కావడంపై సంతోషం వ్యక్తం చేసిన మాధవన్**

**విజయ్ నాయకత్వంలో తమిళనాట మంచి మార్పు వస్తుందనే నమ్మకం ఉందని వ్యాఖ్య**

**రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం తనకు లేదని వెల్లడి**

తన మిత్రుడు విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి కావడంపై ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ సంతోషం వ్యక్తం చేశారు. తాజాగా ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన... విజయ్ నాయకత్వంలో తమిళనాట త్వరలోనే మంచి మార్పు వస్తుందనే నమ్మకం తనకు కలిగిందని వ్యాఖ్యానించారు. విజయ్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ... తామిద్దరం మంచి స్నేహితులమే అయినప్పటికీ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆయనను ఇప్పుడు గౌరవపూర్వకంగా 'సీఎం విజయ్' అనే పిలవాలని అన్నారు. రాజకీయాలను 'రెండు వైపులా పదును ఉన్న కత్తి'గా అభివర్ణించిన మాధవన్... అక్కడ మంచో, చెడో ఏది చేసినా విమర్శించేవారు ఎప్పుడూ ఉంటారని అభిప్రాయపడ్డారు. అలాగే తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు స్వస్తి చెబుతూ, తనకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. ప్రజలను నడిపించాలని లేదా పదవులు చేపట్టాలనే ఆశ తనకు లేదని, సినిమా వృత్తి ద్వారానే సమాజానికి తోడ్పడతానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రతినిధులను గౌరవించడం పౌరుడిగా తన బాధ్యత అని తెలిపారు. కాగా, పారిశ్రామికవేత్త గోపాలస్వామి దొరైస్వామి నాయుడు (+.ణ. ఛీఝఅనబ) బయోలజీ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న 'జీ.డీ.ఎన్' చిత్రంలో మాధవన్ కథానాయకుడిగా నటిస్తున్నారు.



# ఉదయనిధి స్టాలిన్ సినిమాకు త్రిష నో చెప్పారా?

కొన్నాళ్ల క్రితం హిందూ మతంపై చేసిన వ్యాఖ్యలతో కొన్నాళ్లు వార్తల్లో నిలిచిన డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తాజా వివాదంతో మళ్లీ వార్తల్లో కెక్కారు. సినీ నటి త్రిషపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం మనకు తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో, గతంలో వీరిద్దరి కాంబినేషన్ గురించి వెలువడిన వార్తలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉదయనిధి సినిమాలో నటించేందుకు త్రిష నిరాకరించారని, రూ. 12 కోట్ల పారితోషికం ఆఫర్‌ను రిజెక్ట్ చేశారనే ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది. 2018లో దర్శకుడు కె.ఎస్. అధియమాన్ దర్శకత్వంలో 'ఏంజెల్' అనే టైటిల్‌తో ఒక సినిమా రాబోతుందని, అందులో త్రిష కథానాయికగా నటిస్తోందని వార్తలు రాగా, ఆ వార్తల్లో నిజం లేదని అప్పట్లోనే చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇక ఇటీవల ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణంలో నటించేందుకు త్రిషకు రూ. 12 కోట్లు ఆఫర్ చేశారనే వార్త నెట్టింట చక్కర్లు కొట్టినప్పటికీ, దీనిపై త్రిష లేదా రెడ్ జెయింట్ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మీడియా సైతం దీనిని కేవలం ఒక పుకారుగా లేదా నిర్ధారణ లేని అంశంగానే పేర్కొంది. నిజానికి రెడ్ జెయింట్ మూవీస్ నిర్మించిన 'కురువి', 'మన్మథన్ అంబు' వంటి చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించారు. ఉదయనిధి సంస్థతో ఆమెకు మంచి అనుబంధమే ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఉదయనిధి సరసన త్రిష ఒక్క సినిమాలోనూ నటించలేదు. ఫలితంగా, రూ. 12 కోట్ల ఆఫర్‌ను ఆమె తిరస్కరించారనే వార్త కేవలం ఆధారాలు లేని ప్రచారంగానే మిగిలిపోయింది.







# రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

**తనకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువన్న శోభిత**

**భవిష్యత్తులో కమ్యూనిజమే విజయం సాధిస్తుందని వ్యాఖ్య**

**గ్లామర్ ప్రపంచంలో ఉంటూ కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదంటున్న నెటిజన్లు**

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. "నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి.గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు.అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..జ 'చీకటిలో', 'క్రాస్ రోడ్స్' వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 'సిల్ బట్టా', 'వెట్టువం' వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**